క్లుప్తంగా

ఇంటి నిర్మాణానికి చేయూత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన జగన్‌చారి ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చేయూతనందించింది. ట్రస్టు ఆధ్వర్యంలో జగన్‌చారి అసంపూర్తి ఇంటి నిర్మాణం కోసం తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన మెటీరియల్‌ను ఆదివారం ఆ ట్రస్టు సభ్యులు అందజేశారు. నిరుపేదలకు ట్రస్టు అండగా ఉంటుందన్నారు. స్థానిక నాయకులు జగన్, సాయి, ఫయాజ్, రవి, హరినాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని ఎడవల్లికి చెందిన తౌటి చెన్నమ్మ (65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఆ గ్రామ సర్పంచ్ కిష్టమ్మ, మాజీ ఎంపీటీసీ యాదయ్య మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అందజేసిన రూ.3000, వ్యక్తిగతంగా సర్పంచ్ రూ.1000 మొత్తం రూ.4000 అందజేశారు. కార్యక్రమంలో లింగయ్య, పర్వతాలు, మల్లేష్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ నేత శ్రీకాంత్

యాచారం: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మాదిగ ఉపకులాలు ఐక్య పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సిద్దపురం శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం కొత్తపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. జనాభాలో 20 శాతం వరకు మాదిగ ఉపకులాలు ఐక్యంగా ఉంటే వర్గీకరణ సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, మహేశ్, వెంకటయ్య, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికే గుర్తింపు

యాచారం పీఏసీఎస్ ఛైర్మన్ రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి

యాచారం: బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతం కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని యాచారం పీఏసీఎస్ ఛైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో ఆదివారం పార్టీ గ్రామ శాఖ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాలుగో సారి ఎమ్మెల్యేగా గెలిచేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో గునుగల్ గ్రామ సర్పంచ్ ఇందిర, ఉప సర్పంచ్ భీంయాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు తప్పవు

రైతుబంధు మండల అధ్యక్షుడు అంజిరెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కోతలు ఎక్కువైతాయని ఇబ్రహీంపట్నం మండల రైతు బంధు అధ్యక్షుడు మొద్దు అంజిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతూ.. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీకి రైతులంటే గిట్టదన్నారు. రైతాంగానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర, కొనుగోలుకేంద్రాల ఏర్పాటు చేయడమేగాక రైతుబంధు, రైతు బీమాతోపాటు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పరికరాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కాంగ్రెస్ కుతంత్రాలపై రైతన్నలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

రోడ్డుపనుల పరిశీలన

తలకొండపల్లి: చీపునుంతల, కడ్తాల్ మండలంలోని సాలార్‌పూర్ వరకు మట్టిరోడ్డును నాణ్యతగా నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్ష్యుడు గుజ్జల మహేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని చీపునుంతల్లో సర్పంచ్ రఘుపతితో కలిసి ఆయన.. చీపునుంతల-సాలార్‌పూర్ మట్టిరోడ్డును పరిశీలించారు. రోడ్డు రోలర్ తిప్పకపోవడంతో వర్షాలకు రోడ్డంతా బురదమయమై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే మట్టిరోడ్డును పరిశీలించాలన్నారు. వార్డు సభ్యులు పెంటయ్య, జంగయ్య, శివ, సాయినాథ్, గొరియానాయక్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ పరామర్శ

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు గోసుల కృష్ణయ్య(45) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో ఛైర్మన్ వెంకటేశ్‌గుప్త, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, గంప శ్రీనివాస్, మహేశ్, వెంకటేశ్ ఉన్నారు.

నిధులున్నా.. పనులు సున్నా

- మరమ్మతులకు నోచుకోని పోలెపల్లి-మంగలికుంట తండా రహదారి
- అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పోలెపల్లి- మంగలికుంట తండా రోడ్డు పరిస్థితి

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిధిలోని పోలెపల్లి గేటు నుంచి పోలెపల్లి గ్రామం మీదుగా మంగలికుంటతండా వరకు ఉన్న బీటీరోడ్డు అధ్వాన్నంగా మారింది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్డు నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. బీటీరోడ్డు ఆధునీకరణకు నిధులు మంజూరైనా టెండర్ ప్రక్రియ జరగకపోవడంతో పనులు చేపట్టడం లేదు. పోలెపల్లి గేటు నుంచి పోలెపల్లి మీదుగా మంగలికుంటతండా వరకు దాదాపు మూడున్నర కిలోమీటర్ల రోడ్డును దశాబ్దాల క్రితం బీటీరోడ్డుగా నిర్మించారు. ఈ రోడ్డు మీదుగా ఆమనగల్లు, వెల్దండ మండలాలకు చెందిన అనేక గ్రామాల ప్రజలు, ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వెల్దండ మండలం అంకమోనికుంట, సల్లపల్లి, బొల్లంపల్లి గ్రామాలకు ఈ రోడ్డు మీదుగా ప్రజలు వెళ్తుంటారు. మాడ్గుల, ఆమనగల్లు మండలాలకు చెందిన అనేక గ్రామాల ప్రజలకు వెల్దండ, కల్వకుర్తి వెళ్లడానికి ఈ రోడ్డు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

మరమ్మతులు చేయకపోవడంతో..

ప్రస్తుతం రోడ్డంతా గుంతలమయంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో మరింత అధ్వాన్నంగా తయారైంది. చాలాచోట్ల బీటీ, కంకర కొట్టుకుపోయి మట్టిరోడ్డుగా మారింది. మరమ్మతులు చేపట్టాలని పోలెపల్లి గ్రామ ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. కాగా పోలెపల్లి గేటు నుంచి మంగలికుంటతండా వరకు రోడ్డు ఆధునీకరణకు ఎంఆర్ఆర్ కింద రూ.64 లక్షలు మంజూరయ్యాయి. అయితే పనులు చేపట్టడానికి టెండర్ ప్రక్రియ నిర్వహించినప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో నిధులు అలాగే ఉన్నాయి. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

వెంటనే పనులు ప్రారంభించాలి



పోలెపల్లి గేటు నుంచి మంగళికుంటతండా రోడ్డు ఆధునీకరణకు ప్రభుత్వం రూ.64 లక్షలు మంజూరుచేసింది. రోడ్డు బాగుచేయాలని ఎప్పటినుంచో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కోరడంతో నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరైనా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. వెంటనే పనులు ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.
– కుమార్, ఎంపీటీసీ, పోలెపల్లి

ఆర్యవైశ్యుల అభివృద్ధి పట్టని ప్రభుత్వం

సంఘం మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు, వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యుల కోసం ఆర్యవైశ్యబంధు పథకం అమలు చేయాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సర్కార్ గత ఎన్నికల సమయంలో ఆర్యవైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారని గుర్తుచేశారు. జనాభాలో పదిశాతం ఉన్న ఆర్యవైశ్యుల అభివృద్ధిని సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీల అభివృద్ధి కోసం వివిధ పథకాలు అమలు చేస్తుందని, ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యుల అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఆర్యవైశ్యుల కోసం ఆర్యవైశ్యబంధు పథకం అమలు చేయాలని, హైదరాబాద్ లో ఆర్యవైశ్య భవనం నిర్మించాలని రామ్మోహన్ కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు.

మైనార్టీలకు ఆర్థికసాయంపై హర్షం

ఆమనగల్లు: రాష్ట్రంలోని మైనార్టీలకు పూర్తి సబ్సిడీతో రూ.లక్ష ఆర్థికసాయం అందించేలా పథకానికి రూపకల్పన చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆమనగల్లు మున్సిపాలిటీ టీఆర్‌ఎస్ నాయకుడు సయ్యద్ ఖలీల్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. సబ్సిడీ రుణాలతో మైనార్టీలు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె

తేల్చి చెప్పిన జీపీ కార్మికులు

యాచారం: పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ.19,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగిన జీపీ కార్మికుల నిరసన ఆదివారం కొనసాగింది. యాచారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. పారిశుద్య పనుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కృషి చేస్తూ రోగాలబారిన పడుతున్నా మాకు న్యాయం చేసే విషయంలో సర్కార్ మీనమేషాలు లెక్కచేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

ఉరితాళ్లు వేసుకుని నిరసన..

మంచాల: మంచాల మండల కార్యాలయం వద్ద 18వ రోజు సమ్మెలో భాగంగా కార్మికులు ఆదివారం ఉరితాళ్లు మెడకు వేసుకొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కోకన్వీనర్ పోచమోని కృష్ణ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండగానే స్థానిక పంచాయతీరాజ్ శాఖ అధికారులు గ్రామాల్లో పనులు చేయిస్తున్నట్లు బలవంతంగా కొంతమంది సిబ్బందితో ఫొటోలు తీసుకొని తప్పుడు ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. వాస్తవాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పంచాయతీ కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే విధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. పంచాయతీ కార్మిక సంఘం జేఏసీ రాష్ట్ర నాయకుడు గ్యార పాండు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా పాష, భాస్కర్, నాయకులుశంకరయ్య,రవి, సురేష్, యాదయ్య, అర్జున్,నర్సింహ, అంజయ్య, వెంకటయ్య, పాండు,బీరప్ప, చంద్రమ్మ, రోశమ్మ, లక్ష్మి , గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



యాచారం: పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు



మంచాల: ఉరి వేసుకొని వినూత్నంగా నిరసన తెలుపుతున్న కార్మికులు

పడకేసిన పారిశుద్ధ్యం

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారంతో 18వ రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లు పరిష్కరించేవరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదంటూ ఒకవైపు కార్మికులు చెబుతుంటే.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో కార్మికులు ప్రతిరోజూ వినూత్న రీతుల్లో తమ నిరసన తెలుపుతున్నారు. ఐతే కార్మికులు సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్త ఎత్తేవారు, రోడ్లను శుభ్రం చేసేవారు లేక ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయి అపరిశుభ్రత కన్పిస్తోంది. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో సమ్మె చేస్తున్న జీపీకార్మికులు,నేతలను 'సాక్షి' పలుకరించి సేకరించిన అభిప్రాయాలు...

– సాక్షి, నెట్‌వర్క్



యాచారం: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు

ఉద్యోగ భద్రత కల్పించాలి



గ్రామ పంచాయతీ కార్మికుడిగా ఏళ్లుగా పనిచేస్తున్నా. కోవిడ్ సమయంలో ప్రజల ఆరోగ్యం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పారిశుద్య పనులు చేశాం. కనీసం ఉద్యోగ భద్రత లేదు. పనికి తగిన వేతనం ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఇచ్చే వేతనాలు కనీస అవసరాలకు సరిపోవడం లేదు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు తగిన వేతనం ఇవ్వాలి.
– ఖాజా పాష, జీపీ కార్మికుడు, లోయపల్లి

చెత్త పేరుకుపోతోంది

గ్రామ పంచాయతీ కార్మికుల విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. 18 రోజులుగా కార్మికులు సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో చెత్త పేర్కొని పోతుంది. పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా మారే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలి.
– కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్, ఆరుట్ల

రోగాలబారిన పడుతున్నారు



18 రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. మేమే స్వయంగా ట్రాక్టర్లను నడిపి చెత్తను ఎత్తిపోయాల్సిన పరిస్థితి నెలకొంది.
– కుమార్, సర్పంచ్, చంద్రధన

జీతం ఆస్పత్రులకే సరిపోవడం లేదు



30 ఏళ్లుగా పారిశుద్య కార్మికుడిగా పనిచేస్తున్నా. నాకు ఇచ్చే జీతం రూ.5వేలు. ఇచ్చే జీతం రోగాలు వచ్చినప్పుడు ఆస్పత్రులకే సరిపోవడం లేదు. చెత్త తొలగించే సమయంలో తీవ్ర దుర్వాసనకు భోజనం కూడా చేసే పరిస్థితి ఉండదు. కడుపు మాడ్చుకుంటాం. మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి.
– మారమ్మ, జీపీ కార్మికురాలు, మంతన్‌గౌరెల్లి

సమ్మె విరమించే ప్రసక్తే లేదు



గ్రామాల్లో పారిశుధ్యం పనుల్లో ప్రాణాలను సైతం లేక్కచేయకుండా కృషి చేస్తున్న పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి. సీఎం కేసీఆర్ ఎన్నో శాఖల వారిని పర్మినెంట్ చేశారు. జీపీ కార్మికుల డిమాండ్లు నెవవేర్చాలి. కొత్త వ్యక్తులను పెట్టుకుంటాంటే ఊరుకోం.
– చందునాయక్, సీఐటీయూ కన్వీనర్, యాచారం

వెంటనే విధుల్లో చేరాలి



పంచాయతీ సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలి. వర్షాలు కురుస్తున్న సమయంలో గ్రామాల్లో చెత్త నిల్వల వల్ల తీవ్ర దుర్వాసన వస్తుంది. ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. వర్షాలు కురుస్తున్నాయి, తాగునీటి ట్యాంకుల నుంచి నల్లాల ద్వారా తోక పురుగులు వస్తున్నాయని ప్రజలు అంటున్నారు. కార్మికులు విధుల్లో చేరకపోతే కొత్త వ్యక్తులను పెట్టి పారిశుద్ధ్య పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించాం.
– విజయలక్ష్మి, ఎంపీడీఓ, యాచారం



కడ్తాల్: బోనాల ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు, గిరిజనులు

వైభవంగా బోనాలు



తుర్కయంజాల్: ఉత్సవాల్లో వైస్ ఛైర్‌పర్సన్ హరిత, భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని రేఖ్యతండాలో ఆదివారం జగదాంబ మాత బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సింగిల్ విండో ఛైర్మన్ వెంకటేశ్ గుప్తా పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. గిరిజన మహిళలు తండాలోని ప్రధాన వీధుల గుండా బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హరిచంద్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కృష్ణనాయక్, హేమ్లానాయక్, బీమ్లానాయక్, శ్రీను, పంతు, రమేశ్, రాజు, లక్ష్మన్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్ మున్సిపాలిటీలో..

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్, కమ్మగూడలోని పలు కాలనీల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తుర్కయంజాల్‌లోని కట్టమైసమ్మ దేవాలయం వద్ద అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఇంజాపూర్‌లోని సాయినాద్ కాలనీలో నిర్వహించిన బోనాల వేడుకల్లో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధన్‌రాజ్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, కాలనీవాసులు పరమేష్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం

బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి



ఆవిర్భావ వేడుకలో నాయకులు, కార్మికులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద ఆదివారం బీఎంఎస్ ఆధ్వర్యంలో బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీఎంఎస్ జెండాను రాష్ట్ర బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. 1955 జులై 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో బీఎంఎస్ ఆవిర్భవించిందని అన్నారు. దేశంకోసం పనిచేస్తాం.. తగిన వేతనం సాధిస్తాం.. అనే నినాదంతో బీఎంఎస్ పనిచేస్తుందని ఆయన వివరించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ నిరంతరం పోరాడుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు విష్ణుకుమార్, శంకర్‌మాలిక్, లక్యానాయక్, యాదయ్య, చందర్, శ్రీనివాస్ రెడ్డి, పంతునాయక్, అప్పారావ్, కృష్ణారావ్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు బీజేపీదే బాధ్యత

దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో పీఎం మోదీ దిష్టిబొమ్మ దహనం

తలకొండపల్లి: మణిపూర్ రాష్ట్రంలో జరిగిన అమానవీయ సంఘటనను నిరసిస్తూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల పరిధిలోని పడకల్‌లో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామ ప్రధాన కూడళ్ల మీదుగా ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు జోగు రమేష్ మాట్లాడుతూ.. రెండు నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. వెంటనే అక్కడ శాంతి నెలకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయు లు రమేష్, విజయ్‌కుమార్, సతీష్‌కుమార్, రాము లమ్మ, వెంకటమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని స్పందించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: మణిపూర్‌లో ఆదివాసీ గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగికంగా వేధించిన దుండగలను శిక్షించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో మణిపూర్‌లోని అమానవీయం ఘటనలను నిరసిస్తూ ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు నర్సింహ, శాఖ కార్యదర్శులు అశోక్, నర్సింహ, వెంకటేష్, స్వామి, ధనేశ్వర్, బాల్‌రాజ్, యాదయ్య, దానయ్య, శివ, నవీన్, నర్సింహాలు పాల్గొన్నారు.



తలకొండపల్లి: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

ప్రజలు బీఆర్‌ఎస్‌కే పట్టం కడతారు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ప్రతిపక్ష పార్టీల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని.. రాష్ట్రంలో మూడోసారి కూడా కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం రావడం ఖాయమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌పార్టీ అధిష్టానం మాటే తనకు శిరోధార్యమని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లులో డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తున్నామని త్వరలో ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంచి భవన నిర్మాణానికి కృషి చేస్తామని ఆయన వివరించారు. రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే చెప్పారు.ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్ రావ్, ఎంపీటీసీలు కుమార్, సరిత పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం..

ఇబ్రహీంపట్నం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఎంపీటీసీల ఫోరం ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఆదివారం తుర్కగూడలో బీఆర్ఎస్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. పరిశీలకులుగా కోట వెంకట్‌రెడ్డి హాజరైన ఈ సమావేశంలో భరత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను ఓడించే శక్తి ఏ పార్టీకి లేదని.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నియోజకవర్గం నుంచి నాలుగోసారి విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుచ్చిరెడ్డి, టీఆర్ఎస్ నాయకులుకుమార్, రాజేందర్‌రెడ్డి, బుగ్గరాములు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకులు అన్నారు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారానికి 21వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ తక్షణమే గట్టుఇప్పలపల్లిని మండలంగా ప్రకటిచాలన్నారు.



నిరాహార దీక్షలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు